# లాభాల వాటా పంపిణీలో కార్మికులకు అన్యాయం

**టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

మందమర్రి, సెప్టెంబర్ 21: సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరిపోయిందని ఫలితంగా కార్మికులకు లాభాల వాటా పంపిణీలో అన్యాయం జరుగుతున్నదని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మందమర్రి పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది సంస్థకు వచ్చిన నికర లాభాల్లో 33 శాతం వాటాను కార్మికులు, ఉద్యోగులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు రూ.4701 కోట్లు లాభాలు వస్తే 2,289 కోట్ల రూపాయలను సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం పేరిట పక్కన పెట్టి కేవలం 2,412 కోట్ల రూపాయల్లో మాత్రమే 33 శాతం పంపిణీ చేయడం అన్యాయమన్నారు. నికర లాభాల మొత్తం మీద ఎందుకు వాటాను పంచడం లేదని ఆయన ప్రశ్నించారు. వాస్తవ లాభాల్లో అయితే కార్మికులకు దాదాపు రూ.1551కోట్లను పంచాల్సి ఉందని దీంతో ఒక్కో కార్మికుడికి సుమారు 3 నుంచి 4 లక్షల వరకు వాటా అందుతుందని తెలిపారు. రూ.2289 కోట్లను సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళిక, భవిష్యత్ తరాలు, అభివృద్ధి, సంక్షేమ కోసం పక్కన పెట్టామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిలుక పలుకులు పలుకుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ బొగ్గు గని కార్మికులకు లాభాల వాటా పెంచి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తు చేశారు. 33 శాతం లాభాల వాటాను సాధించేందుకు టీబీజీకేఎస్ చేసే పోరాటానికి కార్మికులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, కేంద్ర ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, జే.రవీందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓ.రాజశేఖర్, వెంకటరమణ, ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బడికెల సంపత్, దాసరి శ్రీనివాస్, ఈశ్వర్, రవి యాదవ్, సీపెల్లి రాజలింగు, కనవేని శ్రీనివాస్, పాణి ప్రతాప్, కోరబోయిన లక్ష్మణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే కూల్చివేతలు

- సామాన్యులను భయాందోళనకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 21: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రోద్బలంతోనే నస్పూర్‌లో ఇండ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. శనివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు జరుగుతున్నాయన్నారు. దీంతో పేద, మధ్య తరగతి సామాన్యుల్లో భయాందోళన నెలకొన్నదన్నారు. ప్రశాంతంగా ఉన్న మంచిర్యాల నియోజకవర్గంలో ఒక అలజడి వాతావరణాన్ని తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బీఆర్ఎస్ నేతలపై కక్ష గట్టారని, ఇందులో భాగంగానే బీఆర్ఎస్ నేత డీకొండ అన్నయ్య ఐదు అంతస్తుల భవనాన్ని నేలమట్టం చేశారని అన్నారు. అన్యాయంగా ఆయన ఇల్లును కూలగొట్టడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు స్పందించి, కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలను ఖండించాలని కోరారు. నస్పూర్‌లో చాలా మంది అసైన్డ్ భూముల్లో ఇండ్లు కట్టుకున్నారని, పార్టీ ఏదైనా ఏనాడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని తెలిపారు. పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి అన్నయ్య కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి, ఇల్లును కూల్చివేశారని, ఇంట్లోని సామగ్రిని తీసుకోవడానికి కూడా సమయం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారులు కనీసం మానవతాదృక్పథంతో ఆలోచించకుండా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని, అధికారం ఎవరికీ సొంతం కాదన్నారు. అధికార పార్టీ నాయకులు డబ్బులు సంపాదించేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం కూల్చివేతలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కూల్చివేతలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. తాము అధికారంలో ఉండగా, అందరికీ పట్టాలు ఇచ్చామే తప్పా.. ఎవరి ఇండ్లు కూల్చివేయ లేదని గుర్తుచేశారు.

### అన్నయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ..

అన్నయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శించారు. పోలీసులు తమపై నిర్బంధకాండ కొనసాగించి, ఇంటి సామగ్రిని తీసుకోకుండా అరెస్ట్ చేసి, చివరికి తమపైనే కేసులు పెట్టారని డీకొండ అన్నయ్య, దివాకర్‌రావుకు తెలియజేస్తూ కన్నీటి పర్యంతమైయ్యారు. దీంతో ఒక్కసారిగా దివాకర్‌రావు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. అధైర్య పడవద్దని, తామంతా అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్, నాయకులు ఎర్రయ్య, హైమద్, జక్కుల రాజేశం, రఫిక్‌ఖాన్, పెరుమాళ్ల జనార్దన్, గుమ్మడి శ్రీనివాస్, అడ్లకొండ రవిగౌడ్, బండారి తిరుపతి, తిరుమల్‌రావు, తిప్పని తిరుపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకొండ అన్నయ్య

## అన్ని అనుమతులతో కట్టిన ఇంటిని కూల్చారు

**బాధితుడు డీకొండ అన్నయ్య**

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 21:నిబంధనల ప్రకారం అన్ని అనుమతులతో కట్టినప్పటికీ తన ఇంటిని అధికారులు కూల్చివేడం అన్యాయమని బాధితుడు డీకొండ అన్నయ్య ఆవేదన వ్యక్తం చేశా రు. శుక్రవారం ఆయన నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో మాట్లా డుతూ ఉదయం లేవక ముందే తన భార్య, కొడుకు ను పోలీసులు అరెస్ట్ చేశారని, వాకింగ్‌కు వెళ్లి వచ్చిన తనను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని అన్నారు. ఇంట్లోని సామగ్రిని తీసుకోవడానికి కూడా సమయం ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. తన ఇంట్లో రూ.20లక్షల నగదు, 30 తులాల బంగారు ఆభరణాలు, స్టడీ సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు, రూ.60 లక్షల విలువైన సామగ్రిని ఇంట్లోనే ఉంచి కూల్చివేశారని ఆరోపించారు. తాను నిర్మించిన ఇంటిపై కోర్టులో కేసు నడుస్తుండగా, కూల్చివేయడం అన్యాయమన్నారు. తాను దళితుడిని కాబట్టే ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆయన కుమారుడు డీకొండ నవీన్‌కుమార్, అల్లుండ్లు రాజ్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# లాభం కొండంత.. ఇచ్చేది పిసరంత

- కాంగ్రెస్ మోసం

**సింగరేణి నికర లాభంలో కార్మికులకు 33 శాతం వాటా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు**

- లాభాన్ని సగం పక్కన పెట్టి, మిగిలిన సగంలో 33 శాతం అంటూ ప్రకటన
- పదిహేనేళ్లలో అతి తక్కువగా 16.93 బోనస్ అంటున్న సింగరేణీయులు
- కాసిపేట-2 మైన్‌లో ఐఎన్‌టీయూసీ లీడర్లను నిలదీసిన కార్మికులు
- కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందంటూ మండిపాటు

మంచిర్యాల, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని సింగరేణి కార్మికులు మండిపడుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి లాభం రూ.4,701 కోట్లు అని నిన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందులో రూ.2,283 కోట్లు సింగరేణి భవిష్యత్ ప్రణాళిక కోసమని పక్కన పెట్టి, మిగిలిన రూ.2,414 కోట్లలోనే 33 శాతం వాటా రూ.796 కోట్లు కార్మికులకు ఇస్తున్నట్లు చెప్పారన్నారు. లాభాల్లో వాటా ఇస్తే మొత్తం రూ.4,701 కోట్లలో 33 శాతం అంటే రూ.1,550 కోట్లు ఇవ్వాలి. కానీ.. సగం ఇచ్చి గత ప్రభుత్వం కంటే ఒక్క శాతం ఎక్కువ వాటా ఇచ్చామని సంకలు గుద్దుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గత కేసీఆర్ సర్కారు సింగరేణి కార్మికులకు మొత్తం నికర లాభంలో వాటా ఇచ్చింది. తప్పితే ఇలా కట్ చేసి ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంత ఎక్కువ వాటా ఇచ్చినట్లు ప్రకటించినా.. గడిచిన పదిహేనేళ్లలో ఇది చాలా తక్కువ వాటా అంటున్నారు. 2014లో 21 శాతం లాభాల్లో వాటా ఇచ్చారని, కేసీఆర్ సర్కారు వచ్చాక ప్రతి ఏడాది దానిని పెంచుకుంటూ పోయిందన్నారు. గతేడాది వచ్చిన రూ.2,222 కోట్లలో 32 శాతం రూ.710 కోట్ల వాటా ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం కంటే ఒక శాతం ఎక్కువ 33 శాతం అని చెప్తున్న కాంగ్రెస్ సర్కారు పెద్దలు కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. రేవంత్ చెప్పేదొకటి.. చేసేదొకటని మరోసారి రుజువైందంటున్నారు. కార్మికులను మోసం చేస్తే పుట్టగతులుండవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కాసిపేటలో నిలదీత

మందమర్రి ఏరియా కాసిపేట 2 ఇంక్లైన్ గనిలో ఐఎన్‌టీయూసీ నాయకులు గేట్ మీటింగ్ పెట్టి లాభాల వాటాపై మాట్లాడుతుండగా కార్మికులు వారిని అడ్డుకున్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు పుల్లూరి లక్ష్మణ్‌సహా ఆయనతో వచ్చిన వారిని నిలదీశారు. ''సింగరేణికి రూ.4,701 కోట్ల లాభం వస్తే అందులో మాకు 33 శాతం అంటే ఎంత వస్తదో చెప్పాలన్నారు. లాభాల్లో 33 శాతం అంటే రూ.1,550 కోట్లు రావాలి. కానీ.. ప్రకటించింది మాత్రం రూ.796 కోట్లేనన్నారు. లాభాల్లో రూ.2,283 కోట్లను పక్కన పెట్టి మిగిలిన దాంట్లో వాటా ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడూ తీయలేదు. ఇప్పుడు ఎందుకు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఇంచుమించు సగానికి ఎక్కువ బోనస్ తీసుకుని, మిగిలింది మాకు ఇస్తే అది 33 శాతం ఎలా అవుతుందన్నారు. ఎంత లెక్కలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేది 16 శాతం నుంచి 17 శాతమే వస్తుందన్నారు. సింగరేణి సంస్థ మొదలైనప్పుడు ఎంత బోనస్ ఇచ్చారో.. ఇప్పుడే మళ్లీ అక్కడికి తీసుకొచ్చారంటూ..'' కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు లెక్కలేసి మరీ చెప్పడంతో ఐఎన్‌టీయూసీ నాయకులు సమాధానం చెప్పలేక పోయారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల్లో అసహనం కనిపించింది. ఎవరిని కదిపించినా కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది. ఇదేం వాటా అంటూ కార్మికులు మండిపడుతున్నారు.



**పదేళ్లుగా నికర లాభం, వాటా(రూ. కోట్లు)**

| సంవత్సరం | లాభాలు | వాటా | శాతం |
| --- | --- | --- | --- |
| 2014-15 | 490 | 103 | 21 |
| 2015-16 | 1,066 | 245 | 23 |
| 2016-17 | 395 | 99 | 25 |
| 2017-18 | 1,212 | 327 | 27 |
| 2018-19 | 1,765 | 494 | 28 |
| 2019-20 | 993 | 278 | 28 |
| 2020-21 | 272.64 | 79.07 | 29 |
| 2021-22 | 1,227 | 368 | 30 |
| 2022-23 | 2,222 | 710 | 32 |
| 2023-24 | 4,701 | 796 | 16.90 |

### లాభాలకు తగ్గట్టుగా వాటా ఇవ్వలేదు..



*శ్రీరాంపూర్, సెప్టెంబర్ 21 : సింగరేణి కార్మికులను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘాన్ని అదుపులో పెట్టుకొని మోసం చేస్తున్నాయి. కార్మికులకు న్యాయంగా రూ.1550 కోట్ల లాభాల వాటా ఇవ్వాలి. ఇప్పుడు కేవలం రూ.796 కోట్లు మాత్రమే ఇస్తున్నారు. గతేడాది రూ.2222 కోట్ల లాభాలు వస్తే, ఈ ఏడాది రూ.4701 కోట్ల లాభాలు వచ్చాయి. అంటే కార్మికులకు కూడా లాభాల వాటా డబుల్ రావాలి కదా ?. డబుల్ ప్రాఫిట్ వచ్చినప్పుడు, డబుల్ వాటా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

**-మోటపలుకుల గంగాధర్ కోల్‌కట్టర్, శ్రీరాంపూర్**

### కాంగ్రెస్ ప్రభుత్వంపై కార్మికులు ఆగ్రహంతో ఉన్నారు..



*శ్రీరాంపూర్, సెప్టెంబర్ 21 : సింగరేణి సంస్థ లాభాలు కార్మికులకు తక్కువ చేసి ఇవ్వడంపై కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాలు నికర లాభాల్లో వాటా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని దోచుకుంటున్నది. సంస్థ విస్తరణకు ఒకే సంవత్సరం నిధులు కేటాయించాల్సిన అవసరం లేదు. కానీ విస్తరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2000 కోట్లు దోచుకుంటుంది. కార్మికుల సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికుల కష్టాన్ని రేవంత్‌రెడ్డి సర్కార్ దోచుకుంటుంది.*

**-సందవేణ శ్రావణ్, జనరల్ మజ్దూర్, శ్రీరాంపూర్**

### నికర లాభాల్లో 33 శాతం వాటా ఇవ్వాలి



*శ్రీరాంపూర్, సెప్టెంబర్ 21 : సింగరేణి వాస్తవ లాభాల్లో నుంచి కార్మికులకు లాభాల వాటా 33 శాతం ఇవ్వాలి. ప్రభుత్వానికి సంస్థ నిధులు ధారాదత్తం చేయడానికే తప్పుడు లెక్కలు చూపిస్తున్నారు. రూ.4701 కోట్ల నికర లాభాల నుంచి 2,289 కోట్లు పక్కన పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం. కార్మికులకు రూ.4701 కోట్ల నికర లాభాల్లో నుంచి 33 శాతం చెల్లించాలి. గతేడాది కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 32 శాతం లాభాల వాటా రూ.711 కోట్లతో చూసుకుంటే ఈ సంవత్సరం కార్మికులకు లాభాల వాటా తక్కువగానే వచ్చినట్లుగా చెప్పవచ్చు. కార్మికులను యాజమాన్యం, ప్రభుత్వం మోసం చేస్తుంది.*

**-ఇస్లావత్ గోపాల్, ట్రామర్ ఎస్ఆర్పీ 3, శ్రీరాంపూర్**

### గతేడాది లేని కోత ఇప్పడెందుకు?



*గత సంవత్సరం వచ్చిన రూ.2,222 కోట్ల లాభాల్లో 32 శాతం దాదాపు రూ.710 కోట్లు కార్మికులకు ఇచ్చారు. ఈ ఏడాది రూ.4,701 కోట్లలో 33 శాతం రూ.1,550 కోట్లు కార్మికులకు ఇవ్వాలి. అలా కాకుండా రూ.796 కోట్లు ఇచ్చారు. అంటే కేవలం 16.9 శాతమే ఇచ్చారు. పెంచి ఇచ్చారా.. తగ్గించి ఇచ్చారా అని కార్మికలోకం ఆలోచించాలి. గతేడాది లేని కోతలు ఇప్పుడెందుకు పెట్టారో ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలని మేము డిమాండ్ చేస్తున్నాం.*

**- కొత్తపల్లి ఉదయ్, కాసిపేట 2 ఇంక్లైన్**


నేడే గొప్ప ప్రారంభోత్సవం

హైదరాబాద్ లాంటి మహా నగరాలలో లభించే అత్యాధునిక స్కానింగ్ వైద్య సేవలు ఇప్పుడు మన మంచిర్యాలలో

తేది : 22.09.2024 ఆదివారం రోజున ఉ॥ 10: 45 ని॥లకు ప్రారంభోత్సవం జరుపబడును.

VISION feto care scan centre

Seeing life, before it arrives

విజన్ ఫిటోకేర్ స్కాన్ సెంటర్

బెల్లంపల్లి చౌరస్తా-మంచిర్యాల. సెల్ : 89770 30108

ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న గౌరవ అతితులకు, పురప్రముఖులకు, బంధు-మిత్రులకు స్వాగతం-సుస్వాగతం.

ఆహ్వానించువారు : విజన్ ఫిటోకేర్


# క్రీడలతో సమైక్యత

- కాళేశ్వరం జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రభాకర్
- అటవీ శాఖ ఉద్యోగులకు జోన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 21 : క్రీడా పోటీలతో క్రీడాకారుల్లో సమైక్యత, దేశభక్తి, క్రమశిక్షణ పెరుగుతుందని కాళేశ్వరం జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో డీఎఫ్‌వో శివ్ ఆశీష్ సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాళేశ్వరం జోన్ అటవీ శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌ను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(ఐఎఫ్ఎస్) ప్రభాకర్, కన్జర్వేటర్ ఫారెస్ట్ (ఎఫ్‌డీపీటీ కేటీఆర్) ఐఎఫ్ఎస్ ఎస్ శాంతారాం ప్రారంభించారు. అటవీ శాఖ ఉద్యోగులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా సీసీఎఫ్ ప్రభాకర్ వందన సమర్పణ స్వీకరించిన అనంతరం బెలూన్లు ఎగురవేసి, క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలు ప్రారంభించారు. అటవీ శాఖ ఉద్యోగులకు 1993 నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 16 నుంచి 20 వరకు చత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లో ఆలిండియా అటవీ శాఖ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు పట్టుదలతో క్రీడల్లో పాల్గొని రాష్ట్ర, ఆలిండియా స్థాయి పోటీల్లో రాణించి కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ క్రీడా పోటీల్లో 340 మంది అటవీశాఖ ఉద్యోగులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో ఆసిఫాబాద్ నీరజ్ టిబ్రెవాల్, డీఎఫ్‌వో ములుగు బీ వాసంత, డీఎఫ్‌వో పెద్దపల్లి శివయ్య, సుశాంత్ సింగ్ ఎఫ్‌డీవో కాగజ్‌నగర్, సర్వేశ్వర్ ఎఫ్‌డీవో మంచిర్యాల, టీవీ బాపు ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రభాకర్

# పట్టుబడ్డది ఒకరు.. కేసులు మరొకరిపై..!?



- పేకాటరాయుళ్లపై వాంకిడి పోలీసుల ఔదార్యం
- లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సమాజంలో పలుకుబడి, రాజకీయ అండదండలు, ఆర్థిక బలం ఉంటే చాలు పేకాడుతూ పోలీసులకు పట్టుబడ్డ ఎలాంటి కేసులు కాకుండా బయటపడొచ్చు. మామూళ్లు ఇస్తే చాలు పట్టుబడిన వారికి బదులుగా వేరే వాళ్లపై కేసులు నమోదు చేస్తారు. డబ్బులు ఇస్తే చాలు పోలీసులను మేనేజ్ చేయవచ్చని తెలిపారు. పేకాడుతూ పట్టుబడిన బడా బాబులకు బదులుగా వారి అనుచరులు, డ్రైవర్లపైనో నామమాత్రంగా కేసులు నమోదు చేయించి, వెంటనే బయటకు తేవచ్చు. ఇలాంటి సంఘటనే వాంకిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగినట్లు ఆరోపణలున్నాయి. మంచిర్యాల జిల్లా తాండూరు చెందిన కొంత మంది రాజకీయ నాయకులు వాంకిడి మండలంలోని సరండి గ్రామ సమీపంలోని ఓ చెరువు వద్ద పేకాడుతున్నారన్న సమాచారంతో శుక్రవారం పోలీసులు రైడ్ చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని పోలీసులు శనివారం బయటపెట్టారు. పట్టుబడిన వారిని తహసీల్దార్ వద్ద రూ.2 లక్షలకు బైండోవర్ చేసినట్లు ప్రకటించారు. సరండి వద్ద పేకాడుతూ పట్టుబడిన వ్యక్తులకు బదులుగా వేరే వాళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారనే ఆరోపణలున్నాయి. పేకాడుతూ పట్టుబడినవారు మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఓ మాజీ జడ్పీటీసీ, ఓ ఏఐటీయూసీ నాయకుడు, ఓ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, మరో జిల్లా స్థాయి నాయకుడు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పేకాడుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వీరిపై కేసులు నమోదు చేయకుండా ఈ నాయకులు చెందిన అనుచరులపై కేసు నమోదుశారనే ఆరోపణలు వస్తున్నాయి. నామమాత్రంగా బైండోవర్ కేసును మాత్రమే నమోదు చేసి వదిలేశారని తెలుస్తున్నది. అది కూడా పేకాడుతూ పట్టుబడిన రోజు కాకుండా మరుసటి రోజు కేవలం బైండోవర్ కేసులు పెట్టి వారిని వదిలివేయడం ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. పేకాడుతూ పట్టుబడ్డ బడా నాయకులపై కేసులు నమోదు కాకుండా ఉండేందుకు లక్షల్లో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారం క్రితం కూడా కాగజ్‌నగర్‌లో పేకాడుతూ పట్టుబడిన రాజకీయ నాయకులను వదిలేసినట్లు ఆరోపణలువచ్చాయి. జిల్లాలో విచ్చలవిడిగా విస్తరిస్తున్న పేకాట వ్యసనం పోలీసులకు కాసులు కురిపిస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి.

### పారిపోయిన వారిని పట్టుకుంటాం..

**-వాంకిడి ఎస్ఐ ప్రశాంత్**

మండలంలోని సరండి చెరువు సమీపంలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఇద్దరు పోలీసులు వెళ్లి రైడ్ చేశారు. ఏడుగురు పట్టుబడ్డారు. మరో నలుగురు పారిపోయారు. దొరికిన వారిపై బైండోవర్ కేసు పెట్టాం. పారిపోయిన వారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పారిపోయిన వారు ఎవరనేది కచ్చితంగా చెప్పలేం. వారిని కూడా పట్టుకొని చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679